# ఆర్తగీతం

కాలెపు శివశేఖర్
కొనకంచి లక్ష్మీనరసింహారావు

ఏ ఒక్క ఆత్మీయుడి కోసం వెతుకుతుంటే వేలకొలదీ అదృశ్య హస్తాలు నన్ను వెనక్కి లాగుతున్నాయి.

ఓ అనురాగపు పిలుపు కోసం ... అజరామరమైన స్పందన కోసం... నిరీక్షణతో నిలిచిపోతూ తపనలో తడిసిపోతూ ... యుగ యుగాల ఆర్తితో నా హృదయం ఆక్రోశిస్తోంది.

నా జీవితం నిశ్చలమైన తటాకం అని చాలా మంది అనుకుంటూ వుంటారు. కానీ ఇది ప్రవహించే సెలయేరని, యిందులో కనిపించని సుడిగుండాలు ఎన్నో వున్నాయని ఎందరికి తెల్సు?

అవి తెలపాలనే ప్రయత్నంతోనే ఈ కథ మీ ముందుంచుతున్నాను.

నా పేరు... ఊహూ... చెప్పను.

చెబితే నన్ను గుర్తుపట్టే ప్రమాదం వుంది సుమా? నా లాంటి వారు ఈ సమాజంలో మీకు తరచూ ఎదురౌతూనే వుంటారు. అలా ఎదురైన వారిని మీరు పరిశీలిస్తే వాళ్ళలో నేను తప్పక కన్పిస్తాను.

అజయ్ ఎవరో మొదట్లో నాకు తెలీదు. మా వారి కోసం అప్పుడప్పుడూ వచ్చి పోతుండేవాడు.

అతని పెదవులపై చిరునవ్వు కళ్ళలో చురుకుదనం మొహంలో నిత్యం కనిపించే వుత్సాహం ఆడవాళ్ళను త్వరగా ఆకర్షించే రూపం అతనిది.

ఈ వ్యక్తే నాకు అయిదేళ్ళ క్రితం తారసపడి వుంటే...!

అసలు అజయ్‌తో నేను మాట్లాడతానని గానీ, మా పరిచయం యింత దూరం పయనిస్తుందని గానీ నేను అనుకోలేదు.

ఓ రోజు మధ్యాహ్నం...

ఇంట్లో ఎవరూ లేరు. పిల్లలిద్దరూ నిద్రబోతున్నారు. మా వారు ఈ సమయంలో యింట్లో ఎన్నడూ వుండరు.

వీధి తలుపు ఎవరో తడుతుంటే వెళ్ళి తీసాను.

ఎదురుగా అజయ్.

ఆశ్చర్యపోయాను. ఈ సమయంలో అతను రావడం.

అతడు ఏదో వెతుకుతున్నట్లు నా కళ్ళలోకి చూస్తున్నాడు.

"ఆయనలేరు" అన్నాను చిరాగ్గా. ఇది తెచ్చి పెట్టుకున్న చిరాకని నాకు తెల్సు.

అతడు మౌనంగా వెనుదిరిగి పోయాడు.

బయట ఎండ మాడ్చేస్తోంది. వెచ్చగా వీస్తున్న గాడ్పులు. కనీసం ఆ వ్యక్తికి మంచినీళ్ళయినా యివ్వలేక పోయానే అనుకున్నాను. అతన్ని వెనక్కి పిలవాలని పించింది. అప్పటికే నా పిలుపుకి అందనంత దూరం వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రెండు రోజుల వరకూ అతడు రాలేదు.

నాకు తెలీకుండానే నా కన్నులు అతడి కోసం ఎదురు చూశాయ్. ఏమిటో నాలో ఈ బలహీనత నాలో 'ఏదో మార్పు వస్తోంది. ఏమిటది!'

మూడోరోజు మధ్యాహ్నం అజయ్ వచ్చాడు.

ఆ సమయంలో అయితే ఎవరూ వుండరని అతగాడికి తెల్సునేమో?

"రెండు రోజుల నుంచి రావడం లేదేం!" అడిగాను అతని ఎదురుగా కూర్చుంటూ.

"రోజూ నేను రావాలని కోరుకుంటున్నారా ...!"

ఆ ఎదురు ప్రశ్నకి వెంటనే సమాధానం చెప్పలేక పోయాను.

"కొన్ని నెలలుగా మీ యింటికి వస్తూనే వున్నాను. మీతో ఏకాంతంగా మాట్లాడాలని చాలా సార్లు ప్రయత్నించాను"

"నాతో మాటలా... ఏమిటవి!"

కొన్ని క్షణాలు మౌనంగా వుండి పోయాడు.

అతడి మొహంలోకి తదేకంగా చూడాలని వున్నా, చూడలేక పోతున్నాను.

"నిజం చెప్పాలంటే మీతో పరిచయం పెంచుకోవాలని మిమ్మల్ని చూసిన మొదటిరోజే అనుకున్నాను"

"ఎందుకలా అనుకున్నారు!"

"ఎందుకో తెలియదు"

"కొన్ని విలువైన పరిచయాలు జీవితంలో చాలా ఆలస్యంగా జరుగుతాయి కదూ"

అతడు చిన్నగా నవ్వాడు.

అనంతరం మా మధ్య అనేక మాటలు దొర్లిపోయాయ్. ఆ మాటలు అంత ముఖ్యమైనవి కాకపోయినా, మా పరిచయానికి పునాది రాళ్ళలా వుపయోగపడ్డాయ్.

అరగంట తర్వాత

అతడు వెళ్ళబోతుంటే అడిగాను "మీకు పెళ్ళయిందా!"

గుమ్మం వరకూ వెళ్ళిన అతను ఆగి "కాలేదు" అన్నాడు.

"ఎందుకు చేసుకోలేదు..!"

"మీ లాంటి అందమైన ఆడది దొరకాలిగా" అనేసి అతను వేగంగా వెళ్ళిపోయాడు.

నేను అందంగా వుంటానా!

నిజం?

ఎప్పుడో పెళ్ళికాని రోజుల్లో ఎవరెవరో అంటూ వుండేవారు నా అందం గురించి. పెళ్ళయ్యాక ఎన్నడూ మా వారు నేను అందంగా వుంటానని అనలేదే. అందగత్తెననే విషయాన్నే ఈ అయిదేళ్ళ కాలంలో మర్చిపోయాను.

మళ్ళీ యిన్నాళ్ళకు ఓ మగాడి నోటి వెంట వినడం... ఆశ్చర్యమో, ఆనందమో ఏదో తెలియని వుద్వేగంతో నా గుండెలు వూగిసలాడాయ్.

నా కనుకొనల్లోంచి అతని రూపు అదృశ్యమయ్యే వరకూ చూస్తూ... ఆపై మెల్లిగా అద్దం ముందుకు చేరుకొని... నన్ను నేను చూసుకుంటూ... అలా పది నిమిషాల వరకూ...

అవును? నేను అందంగానే వుంటాను.

కానీ ఆ అందానికి బూజు పట్టి పోయింది. యవ్వనపు కాంతితో మెరిసిన ఈ శిల్పం బీటలు వారి పోయింది.

అజయ్ నా గుండె గోడల్ని ఆక్రమించు కుంటున్నాడు.

ఆ రోజు చాలా రాత్రి వరకూ నిద్ర పట్టలేదు నాకు.

మావారు నా పక్కన చిన్న పిల్లాడిలా నిద్ర పోతున్నారు. అంతవరకూ నన్ను తీవ్రంగా హింసించి, ఆయన ఆదమరచి నిద్ర పోవడం చూస్తే తీవ్రంగానే అసహ్యించు కోవాలని పిస్తోంది.

ఈ సమాజం దృష్టిలో ఆయన నా భర్త.

ఏళ్ళ తరబడి ఆయన మీద నేను పెంచుకున్న కోపం, అసహ్యం... ఎవరికి చెప్పుకోవాలి నా గుండెల్లో ఘోష. ఎవరు స్పృజించగలరు నా మనసు పొరల్ని!

జాలు వారుతున్న నా కన్నీరును తుడిచే నేస్తం? ఎక్కడ... నీ వెక్కడున్నావ్!

జాలిగా చూసే నా కన్నుల్ని తడిమే చెలిమి? ఎక్కడ... నీవెక్కడున్నావ్!

నిద్దుర పొద్దులు ఎన్నో గడిచి పోతున్నాయ్.

వెన్నెల వన్నెలు ఎన్నో తరిగి పోతున్నాయ్.

అయినా, ఏదో ఆశతో ఎదురు చూస్తూనే వున్నాను.

ఆ తెల్లారి అజయ్ కోసం ఎదురు చూస్తూ వుండిపోయాను.

అతడు రాలేదు.

పెళ్ళి అయిన దాన్ని యిద్దరు పిల్లల్ని కన్న దాన్ని మొగుడున్న దాన్ని మరెందుకు పరాయి మగాడి కోసం ఎదురు చూడ్డం!

నా మార్పు నాకే విచిత్రంగా వుంది.

పెళ్ళయాక ఎన్నడూ గడప దాటి బయటకు రాలేదు. వచ్చినా ఏ మగాడి వేపు కన్నెత్తి చూడలేదు.

ఆరోజే కాదు మరో వారం వరకూ అజయ్ నాకు కనిపించలేదు.

గుండెల్లో వెలితి... మనసులో విచారం... కన్నుల్లో నీళ్ళు... బొట్లు బొట్లుగా?

ఇది ప్రేమ కాదు. వ్యామోహం అసలే కాదు. ఓ ఆత్మీయత కోసం పరితపనతో నిరీక్షిస్తున్నాను.

అయినా, అజయ్ రాడేం!

మనసు పొరల్లో శిలగా నిలచిన వ్యధ హృదయపు లోతుల్లో కాఠిన్యంగా మిగిలిన బాధ నా చుట్టూ వున్న చీకటి తెరల్ని తొలగించడానికి ఓ ఆప్త హృధి కోసం తపనతో వేచి చూస్తున్నాను.

అయినా అజయ్ రాడేం!

అశాంతి రాజ్యంలో చిక్కుకున్న అభాగినిని నేను. దుఃఖ సాగరంలో మునిగియున్న అబలను నేను. నా జీవితాన్ని సుఖాల తీరాలకు లాక్కుపోయే ఓ ఆలంబన కోసం ఆశతో ఎదురు చూస్తున్నాను.

అయినా అజయ్ రాడేం!

మధ్యాహ్నపు వేళల్లో నా చూపులు వీధి గుమ్మంలోకి సారించి... నిమిషాలు గడుస్తుంటే... నిరాశతో... ప్చ్? చివరకు మిగిలేవి నిస్పృహల నిట్టూర్పులు.

ఓ రోజు అజయ్ రానే వచ్చాడు.

నా ఆనందం ఏమని చెప్పుకోను!

గుండె లెందుకో విపరీతంగా చప్పుడు చేశాయ్. ఆ చప్పుళ్ళు అజయ్‌కి విన్పిస్తాయేమోనని భయపడ్డాను.

"ఇలా నేను మీ వారు లేని సమయాల్లో రావడం మీకేమయినా యిబ్బందిగా వుందా!" అన్నాడు.

అతని చూపులు నా పాదాల్ని చూస్తున్నాయ్.

ఆ చూపుల తాకిడికి నా పాదాలు కందిపోతాయేమో అన్పించి చీర కుచ్చిళ్ళను ముందుకు లాక్కున్నాను.

**ఎప్పుడో పెళ్ళికాని రోజుల్లో ఎవరెవరో అంటూండేవారు నా అందం గురించి. పెళ్ళయ్యాక ఎన్నడూ మావారు నేను అందంగా వుంటానని అనలెదు. అందగత్తెననే విషయాన్ని ఈ అయిదేళ్ళ కాలంలో మరచి పోయాను. మళ్ళీ ఇన్నేళ్ళకు ఓ మగాడి నోటి వెంట వినడం... ఆశ్చర్యమో ఆనందమో తెలియడం లెదు గుండెలు కొట్టుకో సాగాయి.**

''అంత యిష్టం లేని దాన్నయితే మొదటి రోజునే మిమ్మల్ని పొమ్మందును''

''నేను యిలా వస్తున్నట్లు మీ వారికి చెప్పారా!''

లేదన్నట్లు తల అడ్డంగా వూపాను.

''ప్రామిస్'' అతడి చేయిని ముందుకు చాపాడు.

అప్రయత్నంగా నా చేయి అతని చేతిలో వేస్తూ... ఆ క్షణం... నన్ను నేను మరచిపోతూ... ఈ స్పర్శకే చిగురుటాకులా వణికిపోతూ ...?

అయిదు నిమిషాల వరకూ ఆ స్పందన తరంగాలు నాలో చెదిరి పోలేదు.

''మిమ్మల్ని చూస్తే నాకేమని పిస్తోందో తెల్సా!'' అతడే అన్నాడు. చెప్పండి అన్నట్లు చూశాను.

జీవితంలో విలువయిన దేదో పోగొట్టుకున్నానని పిస్తుంది.

''అంటే!''

''అర్థం కాలేదంటే... ఐ కాంట్ బిలీవ్''

అర్థాలు ఎన్ని స్ఫురించినా నిశ్శబ్దమే నా సమాధానం.

ఎందుకంటే నేను వివాహితను. తాళి కట్టించుకొని ఓ మగాడికి ఆలి నయ్యాను. కొన్ని పరిథులు నా చుట్టూ గీయబడ్డాయ్. కొన్ని బంధాలు నా కాళ్ళకు చుట్టుకోనున్నాయ్.

''మాట్లాడరేం!''

ఉలిక్కిపడి చూశాను.

అతడు నా వేపే చూస్తున్నాడు.

''ఏం చెప్పను... ఊహు...'' చిన్నగా అన్నాను.

అతడు వెళ్ళడానికి వుద్యుక్తుడయ్యాడు.

''మళ్ళీ ఎప్పుడొస్తారు!''

''రాను. మరో పది రోజుల వరకూ రాను''

దిగులుతో నా కన్నులు దీనంగా చూస్తున్నాయ్.

అతడు వెళ్ళిపోతున్నాడు.

''అజయ్'' పిల్చాను.

అతడు ఆగి నా వేపు చూశాడు.

అతనికి దగ్గరగా నడిచి ''రేపు మీరు వస్తున్నారు'' అన్నాను.

''ఎలా! పది రోజుల...''

''అప్పటి వరకూ మీ కోసం నా గుండె ఆగకుండా వుంటుందని మీరు చెప్పగలరా!''

అతడు ఆశ్చర్యంగా నా వేపు చూస్తున్నాడు.

''రేపు మీరు రాకపోతే నా గుండెను శాశ్వతంగా ఆపేస్తాను అజయ్'' అతడి కళ్ళల్లోకి చూడలేక తల దించుకున్నాను.

అనంతరం అతని అడుగులు నాకు దూరమై పోయాయ్.

అతని పట్ల నేనేందుకు ఆకర్షితురాలి నవుతున్నానో నాకే తెలీడం లేదు. అతని నుంచి పవిత్రమైన నా స్నేహాన్ని తప్ప మరేం ఆశించడం లేదా!

నాలో నేను ఎన్నో సార్లు ప్రశ్నించుకున్నాను. స్పష్టమైన సమాధానం గోచరించడం లేదు.

ఆ రాత్రి మావారు త్వరగానే యింటికి చేరుకున్నారు.

ఏదో చిన్న విషయమై నన్ను గొడ్డును బాదినట్లు బాది నా శరీరం గాయాలతో నెత్తురు కక్కుతుండగా బాధతో నేను మూల్గుతుండగా ఆయన మాత్రం కసిగా నన్ను నలిచేస్తూ మరింత హింసించి, నగ్నమైన నా ఎదపై ఆయాసంతో వొరిగి పోయారు. తర్వాత ఎప్పటికో నిద్రలో జారుకున్నారాయన.

నెత్తురు మరకల్తో, కన్నీళ్ళతో దుప్పటంతా తడిసి పోయింది.

ఇది నా జీవితంలో నిత్య నరకం. దీన్నుంచి విముక్తి ఎన్నడో!

ఈ పవిత్ర భారతంలో నాలాటి స్త్రీలు ఎందరో!

ఆ తెల్లారి అతి కష్టం మీద యింటి పనులన్నీ పూర్తి చేసుకుని అజయ్ రాక కోసం ఎదురు చూస్తూ వున్నాను.

అనుకున్న సమయానికి అజయ్ వచ్చాడు.

కానీ, అతడి మొహంలో చిరునవ్వు లేదు. రాగానే జేబులోంచి ఏదో ప్యాకెట్ తీసి టీపాయ్ మీదుంచాడు.

''ఏమిటది!'' అడిగాను ఆశ్చర్యంగా.

''మందులు మీ కోసమే. అసలు మీలాటి స్త్రీలు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఎప్పుడూ దగ్గరుంచుకోవలసిందే''

''అజయ్... అయితే మీరు...''



''రాత్రి మీ జీవితం ఎంత దేదీప్యంగా వెలిగి పోయిందో చూశాను... క్షమించండి. దొంగచాటుగా రాత్రి మీ బెడ్‌రూం కిటికీ దగ్గర నిలబడి అంతా చూశాను. అనుకోకుండా రాత్రి యిటు వేపు వచ్చాను. చాటుగానైనా మిమ్మల్ని చూడాలనిపించింది.''

ఒక్క నిముషం నాలో ఏదో విస్మయం... రాత్రి జరిగిన సంఘటనలు... ఎందుకో దుఃఖం పొర్లు కొచ్చింది... ఏడ్చేస్తున్నాను.

అలా ఎంత సమయం గడిచిందో నాకు తెలీదు. హఠాత్‌గా అతని చేయి నా తలను నిమురుతుంటే, ఏదో పెన్నిధి దొరికినట్లు వుక్కిరి బిక్కిరవుతూ, అంతలోనే మళ్ళీ ఏడ్పు పొర్లుకు రాగా... అతని గుండెల మీద తల వాల్చి రోదిస్తుండి పోయాను.

అతను నన్ను యింకా దగ్గరకంటా హత్తుకుంటూ. ఈ ఓదార్పు చాలు... యిలాగే శాశ్వతంగా కన్నులు మూసేస్తాను.

పది నిమిషాలు గడిచి వుంటాయ్.

ఏడ్పును దిగ మింగుకుంటూ అతనికి దూరంగా జరిగాను.

మరో రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడచిపోయాయ్.

''ఎందుకో అతనితో మీరింకా కాపురం చేస్తున్నారు!'' అడిగాడు అజయ్.

మౌనంగా వుండి పోయాను.

''డైవోర్స్ ఇచ్చేయ కూడదూ!''

''మొగుడు లేని ఆడదానికి ఈ సమాజంలో విలువ వుంటుందంటారా!''

''ఈ నరకాన్ని భరిస్తూ ఎంతకాలం వుండగలరు అతన్తో!''

''జీవితాంతం''

''దాంపత్య జీవితం నిండుగా ప్రవహించే నది కాదు. కన్పించని ఊబిలెన్నో వుంటాయని ప్రత్యక్షంగా మిమ్మల్ని చూసి అనుకుంటున్నాను'' నిర్లిప్తంగా నవ్వేశాను.

''ఆలోచించండి... మీ గురించి ఏమైనా చేయగలను... మీ జీవితానికి అండగా నేనుంటాను... మీ భర్తని వదిలేయడం మంచిదని నా అభిప్రాయం''

మరో అయిదు నిమిషాల తర్వాత అజయ్ వెళ్ళిపోయాడు.

ఆ రోజంతా అజయ్ చెప్పిన మాటల గురించే ఆలోచిస్తూ వుండి పోయాను. ఏం చేయాలి!

ఎన్నెన్నో ప్రశ్నలు పుడుతూనే వున్నాయ్? వేటికీ సమాధాన పడలేక పోతున్నాను.

రోజులు గడిచి పోతున్నాయ్.

నేను హింసించ బడుతూనే వున్నాను.

అజయ్ నన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చుతూనే వున్నాడు.

అతడి సమక్షంలో సర్వం మర్చి పోగలుగుతున్నాను.

మా స్నేహం మరికాస్త పెరిగింది.

మా మధ్య చనువు మరింత ఎక్కువయింది.

గంటల తరబడి కబుర్లాడు కుంటూ కౌగిళ్ళ రాపిళ్ళలో విశ్రాంతి పొందుతూ... ఒకరి వడిలో మరొకరు ఒదిగిపోతూ... ఈ సమయాలు అశాశ్వితాలైనా, ఈ అనుభూతులు శాశ్వితాలు. వ్యక్తులం దూరమైనా, ఈ అనుభవాలు అవ్యక్తాలు.

కన్నె దశలో పొంద వలసిన ప్రేమైక జీవితాన్ని ప్రౌఢ దశలో పొందుతున్నాను. నాలో నిక్షిప్తమైన అశాంతి... నాలో గుప్తమైన బాధ అన్నిట్నీ అజయ్‌కి చెప్పుకున్నాను. కానీ, యిక్కడ అన్నిటి కంటే ఆశ్చర్యకరమైన విషయమేటంటే అజయ్ ఎన్నడూ నా శరీరాన్ని కోరుకోలేదు. అటువంటి వాంఛ అతనిలో వున్నట్లు ఏనాడూ బహిర్గత మవ లేదు. విచిత్రం? అటువంటి ఆలోచన్లు నాలో కూడా రాలేదు.

ఇప్పటి వరకూ మా మధ్య స్నేహం తప్ప 'మరోటి' లేదని ఖచ్చితంగా చెప్పగలను.

అజయ్ మధ్య మధ్యలో నన్ను అడుగుతూనే వున్నాడు నన్ను తన కూడా వచ్చేయమని?

వెళ్ళలేను. వెళ్ళే ధైర్యం నాకు లేదు.

బంధు వర్గంలో యావత్ ఈ సంఘంలో చులకనౌతానని వెలివేయ బడ్తాననే భయం?

స్త్రీ పురుషుల మధ్య స్నేహం కంటే కామ పరమైన కోర్కెలే ఎక్కువ వుంటాయని నా అభిప్రాయం.

మాలో అటువంటి కోర్కెలు చెలరేగిన రోజున మా మధ్యవున్న మిత్రత్వం శకలమై దగ్ధమై పోతుంది. అందుకే ఒక అడుగు కూడా ముందుకు వేయలేక పోతున్నాను.

అజయ్ జీవితాంతం నా చెంతనే వుంటాడనుకున్నాను.

కానీ అలా జరగలేదు.

కొన్ని నెలలు గడిచిపోయాక...

ఓసారి అజయ్ అన్నాడు "నేను త్వరలో పెళ్ళి చేసుకో బోతున్నాను"

కొన్ని క్షణాల పాటు స్థంభించి పోయాను.

"బహుశా... పెళ్ళయ్యాక నేను నీకు కన్పించక పోవచ్చు"

ఆ మాటను భరించలేక పోతున్నాను. నా కన్నుల్ని సన్నటి నీటి పొరలు కప్పేస్తున్నాయ్.

అతని చేతులు నన్ను చుట్టేస్తూ "నన్ను వదిలి నీ వుండలేవని తెల్సు. ఎంత కాలం నేనిలా వంటరిగా ఉండను చెప్పు!" అన్నాడు.

"నీవు వంటరివా అజయ్ నీకు నేను లేనూ!" గొంతు పెగుల్చుకొని ఎలాగో అన్నాను.

"ఇప్పటికైనా మించి పోయింది ఏమీ లేదు. నీవు నాతో రాగలవా!"

"ఎలా రాను! భర్తని వదిలి, పిల్లల్ని కాదనుకొని నీతో ఎలా రాగలను!"

"పిల్లల్ని మన కూడా తీసుకుపోదాం. నిన్ను పెళ్ళి చేసుకుంటాను"

"ఈ సమాజం నవ్వి పోదూ ఇద్దరు పిల్లల తల్లిని పెళ్ళి చేసుకున్నావని అందరూ హేళన చేస్తారు"

"ఫర్వాలేదు. నీ కోసం అన్నీ భరించగలను"

"లేదు అజయ్? ఈ మాటను మరి కొంత కాలం పోయాక నీవు మనస్ఫూర్తిగా చెప్పలేవ్. ఎందుకంటే మనం పాతబడి పోయాక నా పట్లవున్న వ్యామోహం నీలో సన్నగిల్లుతుంది. ఎవరికో పుట్టిన నా యిద్దరి పిల్లల్ని నీవు నీ పిల్లలుగా అంగీకరించ లేవ్. నేను నీతో వస్తే అవమానాలే కాదు, ఎన్నో యిబ్బందులు కూడా ఎదురౌతాయి. అందుకే నీతో రావడానికి సాహసించ లేక పోతున్నాను"

అజయ్ ఎటో చూస్తూండి పోయాడు.

గదిలో గోడ గడియారం చప్పుడు తప్ప మరే శబ్దం విన్పించడం లేదు.

"ఇన్నాళ్ళ పరిచయంలో నన్ను పూర్తిగా అర్థం చేసుకోలేక పోయావ్. నీ మీద నాకున్న ప్రేమ, అనురాగం కొన్ని రోజుల తర్వాత తరిగిపోయేవి కావు. నా మీద ఏమాత్రం నమ్మకం వున్నా నాతో వచ్చేయ్. నీ కోసం అన్నీ వదులుకొని నీ అంగీకారం కోసం మరో రెండు రోజులు పోయాక వస్తాను" చివరి మాట నొక్కి పల్కుతూ అజయ్ వెళ్ళిపోయాడు.

ఆ రెండు రోజులు ఆలోచన్లతో నా బుర్ర వేడెక్కి పోయింది.

ఎటూ తేల్చుకోలేక తటస్థంగా వుండి పోయాను.

"ఏం నిర్ణయించుకున్నావ్!" గడువు అనంతరం వచ్చి అడిగాడు అజయ్.

అతనితో ఎన్నో చెప్పాలని వున్నా, గొంతులోంచి మాట రావడం లేదు.

"నీవేం చెప్పలేవని నాకు తెల్సు"

అయిదు నిమిషాలు మౌనంగా వుండి పోయాం.

అజయ్ దీర్ఘంగా నిట్టూర్చి వెళ్ళడానికి పైకి లేచాడు.

"అజయ్ నీవీ పెళ్ళి మానుకోలేవా... ఇది స్వార్థమే కావచ్చు... ఈ స్పందన... ఈ అనుభూతి... జీవితాంతం నాక్కావాలి. నీ వెళ్ళిపోతే, నా బాధను, అశాంతిని ఎవరితో పంచుకోగలను! నా కన్నీరుని తుడిచేదెవరు!"

అతడు నా మొహంలోకి ఓ సారి చూసి వెనుదిరిగి పోయాడు.

"అజయ్... నన్నిలా నిర్దాక్షిణ్యంగా వదిలి నీవెళ్ళి పోతావా!"

అతడు ఆగలేదు.

"అజయ్ ఒక్క నిమిషం ఆగవ్వా..."

అతను ఆగలేదు సరికదా కనీసం వెనుదిరిగి కూడా చూడలేదు.

గుమ్మం వరకూ అనుసరించి ఆగిపోయాను.

అతని అడుగుల చప్పుడు దూరమైపోతూ ... అతని రూపం నా కన్నుల్లోంచి జారిపోతూ...

వెళ్ళిపోయాడు... అజయ్ వెళ్ళి పోయాడు.

*


ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక

కార్టూనిస్టులకు శుభవార్త!

## కార్టూన్‌ల పోటీ (విడి కార్టూన్‌లు)

ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక దీపావళి ప్రత్యేక హాస్య సంచికను పురస్కరించుకుని కార్టూన్‌ల పోటీ ఏర్పాటు చేస్తున్నాము. కార్టూ నిస్టులు ఉత్సాహంగా పాల్గొని పోటీని జయప్రదం చెయ్యగోర్తాము.

మొదటి బహుమతి రు. 200.

రెండో బహుమతి రు. 150.

మూడో బహుమతి రు. 100.

మరో మూడు కన్సొలేషన్ బహుమతులు ఒక్కొక్కటి రు. 50.

**పోటీకి నియమ నిబంధనలు.**

* పోటీకి పంపే కార్టూన్‌లు ఏ విషయం మీదనైనా వుండవచ్చు (దీపావళే కానక్కర్లేదు).
* కార్టూన్‌ల సైజు 10X15 సెం.మీ. వుండాలి.
* కార్టూన్‌లు ఇండియన్ ఇంక్‌తోనే వెయ్యాలి.
* కార్టూన్‌ల వెనక అడ్రసు తప్పనిసరిగా వుండాలి.
* పోటీలో ఎంపిక చేసిన (బహుమతిరాని) కార్టూన్‌లను మామూలుగా ప్రచురించే హక్కు మాకుంటుంది.
* పోటీ విషయంపై తుది నిర్ణయం ఎడిటర్‌దే. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.
* కార్టూన్‌లు— ఎడిటర్, ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 36 సరోజినిదేవి రోడ్, సికింద్రాబాద్ — 3 కు పంపాలి.

**కార్టూన్‌లు మాకు చేరవలసిన ఆఖరు తేదీ అక్టోబరు 15.**